క్లుప్తంగా

గూట్లపాడులో 'కంటి వెలుగు'



గూట్లపాడులోని సబ్ సెంటర్‌లో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: కళ్లకు సోకే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి అన్నారు. మండలంలోని గూట్లపాడు ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ అవ్వ తాతల కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. నేత్ర వైద్యాధికారి రామకృష్ణ 160 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 15 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించగా, వారిని ఏలూరులోని శేఖర్ నేత్రాలయకు సిఫారసు చేశారు. 20 మందికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. వైద్యాధికారిణి డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ 50 సంవత్సరాలు పైబడిన వారు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాధామదనమోహనుల రథోత్సవం



ఉండిలో ఊరేగుతున్న రాధామదనమోహనులు

ఉండి: రాధా మదన మోహనస్వామి వారి మందిరములో నిర్వహిస్తున్న శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం గ్రామంలో స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రాధామదనమోహన స్వామి ఆలయంలో శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి వారికి పంచామృతాలతో నిర్వాహకులు మహాభిషేకం చేశారు. అనంతరం ప్రధాన వీధుల్లో స్వామివారికి రథోత్సవాన్ని నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి స్వామివారికి మహానైవేద్యం అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

నేటి జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సాక్షి, భీమవరం: పట్టణంలోని కోర్టుల్లో శనివారం నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, 3వ అదనపు జిల్లా జడ్జి పి శ్రీసత్యాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌కు న్యాయవాదులు, పోలీస్ అధికారులు సహకరించాలని శ్రీసత్యాదేవి కోరారు.



భీమవరం పట్టణ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వన్‌టౌన్‌లో రూ.20.50 లక్షలతో నిర్మించిన త్యాగరాజ భవనంకు వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఆయన శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ప్రజల సూచన మేరకు ప్రతి వార్డులోనూ సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టడం జరిగిందని అన్నారు. ఇప్పటికే వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయగా, కొత్తగా మరికొన్ని రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామని, వాటికి కూడా త్వరలోనే అనుమతులు వస్తాయని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. గత నాలుగేళ్ల కాలంలో భీమవరం పట్టణంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేసినట్లు చెప్పారు. కరోనా కారణంగా అభివృద్ధి పనులలో కొంత మేర జాప్యం జరిగిందని, కరోనా అనంతరం పనులను వేగవంతం చేశామన్నారు. ప్రజలు తమ దృష్టిలో ఉన్న ఇంకా ఏమైనా అభివృద్ధి పనులకు సంబంధించి తనకు సమాచారం ఇస్తే వారి సూచన మేరకు, వారి కోరిక మేరకు పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులను చేయడం జరుగుతుందని అన్నారు. నూతనంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరం కేంద్రం కావడంతో భీమవరం పట్టణాన్ని రాష్ట్రస్థాయిలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో రేవూరి గోగురాజు, తోట భోగయ్య, చెల్లబోయిన సూర్య ప్రకాష్, గంటా సుందర్ కుమార్, కొట్టి కుటుంబరావు, మందారపు శ్యాంసుందర్, గ్రంధి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జగపతిరాజు

సాక్షి, భీమవరం: అంతర్జాతీయ స్థాయి పోటీని తట్టుకోవాలంటే ఇంజినీరింగ్ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు సాంకేతికను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు అన్నారు. టోస్ట్ మాస్టర్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ 126 ప్రాంతీయ స్థాయిలో మాస్టర్ ఆరేటర్ చాంపియన్ షిప్ సీజన్ 5 పోటీలను శుక్రవారం కళాశాలలో ప్రారంభించారు. కళాశాల టోస్ట్ మాస్టర్ క్లబ్ అధ్యక్షుడు ఎల్ పవన్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 17 వరకు వివిధ ప్రాంతాలలో చాంపియన్‌షిప్ పోటీలు, 30న సెమీ ఫైనల్స్, అక్టోబర్ 7వ తేదీన ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తారన్నారు. టోస్ట్ మాస్టర్ డిస్ట్రిక్ 126 డైరెక్టర్ సందీప్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో అంతర్జాతీయ స్థాయి సెమినార్స్, వర్క్ షాపుల్లో పాల్గొనడం వలన ఇంగ్లిష్ భాషలో మంచి పట్టు సాధించడమే గాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో యూనిట్ కోఆర్డినేటర్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి, పి భవాని, కేఆర్ సత్యనారాయణ, సీహెచ్ రూపా జాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్ ఫ్రీ ఆన్‌లైన్ సెంటర్ ప్రారంభం

సాక్షి, భీమవరం: స్థానిక సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఐసెట్ ఫ్రీ ఆన్‌లైన్ సెంటర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ సకుమళ్ళ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసి ఎంబీఏ, ఎంసీఏలో చేరే విద్యార్థులు ఈనెల 14వ తేదీ లోపుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌కు అవసరమైన అన్ని ధ్రువపత్రాలతో తమ కళాశాలకు వస్తే ఉచితంగా ఆన్‌లైన్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ, ఎంసీఏ హెచ్ఓడీలు సత్య కృష్ణ, దుర్గాప్రసాద్, టీఎస్ఎన్ లావణ్య, ప్రసన్న, కమల, వెంకటేష్ పాల్గొన్నారు.

గరికపాటి ఆశయ సాధనకు కృషి చేయాలి



సినీ మేకప్‌మెన్ పసుపులేటిని సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కళల ద్వారా సమాజాన్ని చైతన్యం చేయవచ్చని నిరూపించిన డాక్టర్ గరికపాటి రాజారావు ఆశయ సాధనకు కళాకారులంతా కృషి చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సీతారాంప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి వ్యవస్థాపకుడు రాజారావు వర్ధంతిని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ప్రసాద్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజానాట్యమండలి పాత్ర మరువలేనిదన్నారు. ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దిన గరికిపాటి ఆశయ సాధన కోసం నేటి కళాకారులంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారుడు సినీ మేకప్‌మెన్ పసుపులేటి సూర్యచంద్రరావును ఘనంగా సత్కరించారు. ఫోకస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, కళారంజని వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, పులఖండం ఉగాది, చాంద్ బాషా, మల్లుల శ్రీనివాస్, పోశంశెట్టి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం



108 సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని భీమవరంలో శుక్రవారం ప్రముఖ ఫిజియోథెరపిస్టు డాక్టర్ వంశీకృష్ణ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఫిజియోథెరపీని ప్రోత్సహించడం కోసం, ప్రజల్లో అవగాహన కలిగించడం కోసం 1996 నుంచి సెప్టెంబర్ 8న ఫిజియోథెరపీ దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా క్షణాల్లో 108 వాహన సిబ్బంది అందించే సేవలు అభినందనీయన్నారు. ఈ సందర్భంగా 108 సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భీమవరం పట్టణ లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నడింపల్లి మహేష్, బోండా రాంబాబు, ట్రెజరర్ కోట్ల నాని, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, పాశం సుభద్రదేవి, కట్రెడ్డి రామచంద్రరావు, పేరిచర్ల మూర్తిరాజు, అల్లు తులసి ప్రసాద్, తాళ్లూరి త్రివిక్రమరావు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి



డిగ్రీ కళాశాలలో మూర్తిరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: కుల, మత, ప్రాంతం, లింగభేదం లేకుండా ప్రజలంతా అక్షరాస్యులైతేనే దేశం అభివృద్ధి చెందుతుందని సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు బీహెచ్ వెంకటపతిరాజు అన్నారు. భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వసుధ ఫౌండేషన్ కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఫౌండేషన్ తరపున ఫీజులు, పుస్తకాలు అందిస్తామన్నారు. ఈసందర్భంగా కళాశాలలో బీకాం చదువుతున్న డి.వెంకటలక్ష్మికి రూ.12 వేలు ఆర్థిక సహాయాన్ని వెంకటపతిరాజు చేతుల మీదుగా అందించారు. ముందుగా విద్యాదాత చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన, చెరుకువాడ రంగసాయి, కాకుమాని శ్రీనివాసరావు, సత్యనారాయణ, పి అమూల్యారావు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అండగా..



హ్యాండి క్రాఫ్ట్ బజార్‌ను ప్రారంభించి వస్తువులు తిలకిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: చేనేత కార్మికులకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులను ఆదుకునే దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. పట్టణంలోని త్యాగరాజ భవనంలో ఏర్పాటుచేసిన చేనేత హస్తకళ హ్యాండ్లూమ్, హ్యాండి క్రాఫ్ట్ బజార్‌ను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బజార్ లో అనేక చేనేత వస్త్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ధరలు కూడా తక్కువగానే ఉన్నాయని ప్రజలు వీటిని ఆదరించి చేనేత కార్మికులకు అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రేవూరి గోగురాజు, తోట భోగయ్య, చెల్లబోయిన సూర్య ప్రకాష్, గంటా సుందర్ కుమార్, కొట్టి కుటుంబరావు, మందారపు శ్యాంసుందర్, గ్రంధి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

దానేశ్వరి అమ్మవారి సన్నిధిలో...



అమ్మవారిని దర్శించుకున్న విజయవాడ డిప్యూటీ మేయర్ దుర్గ

ఆకివీడు: అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలకు సుఖ సంతోషాలు, పాడి పంటలు వృద్ధి చెందుతాయని విజయవాడ డిప్యూటీ మేయర్ బీ.దుర్గ చెప్పారు. స్థానిక గుమ్ములూరులోని దానేశ్వరి అమ్మవారిని శుక్రవారం ఆమె దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ మేయర్ దుర్గ, ఆమె కుమారుడును దుశ్శాలువాతో, పూల మాలలతో ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధర రావు, ఆలయ ట్రస్టు చైర్మన్ బండారు జలదుర్గ ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏఎంసీ చైర్మన్ ఎస్కే. రసూల్ బీబీ, కౌన్సిలర్ నిమ్మల నాగు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని బాలికకు గాయాలు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనం ఢీకొని ఓ బాలికకు గాయాలయ్యాయి. వివరాల ప్రకారం యమునాపల్లి గ్రామానికి చెందిన గంటా శ్రీను కుమార్తె గంటా జ్యోష్ణ 4వ తరగతి చదువుతుంది. సైకిల్‌పై బాలిక ఇంటికి వస్తుండగా భీమవరం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలిక తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మోహన్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కమ్యూనిటీ హాల్ ప్రారంభం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ధర్మాపుర అగ్రహారంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు శనివారం ఉదయం 9.30 నిమిషాలకు ప్రారంభిస్తారని కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



శ్రీమావుళ్లమ్మ ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



ఆదిలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న వరలక్ష్మీ వ్రతాలు



ఆకివీడు : పిల్లల మర్రి అగ్రహారంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు



ఆకివీడు: వాసవీ మాతకు కలువలతో పూజలు నిర్వహించిన దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రావణమాస సందర్భంగా శుక్రవారం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ పర్యవేక్షణలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ వ్రతాలకు పూజ ద్రవ్యాలు, లక్ష్మీదేవిరూపు, మావుళ్లమ్మ అమ్మవారి ఫొటోలను దాతలు దేవస్థానం వారి సహకారంతో మహిళలకు అందజేశారు. ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ, వేదపండితులు సంప్రదాయబద్ధంగా వరలక్ష్మీ వ్రతాన్ని మహిళల చేత చేయించారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి ఇ.సుబ్బారావు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఆలయ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు రామాయణం సత్యనారాయణ, ముత్యాల వెంకటరామారావు, మావూరి సుందరరావు, చెల్లంకి శేషగిరి, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, కోయ వెంకటలక్ష్మి, గోపిశెట్టి విజయలక్ష్మి, నీలాపు నాగలక్ష్మి, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంలో..

శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ ఆదిలక్ష్మి రాజ్యలక్ష్మీ పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అర్చకులు మహిళలచే వరలక్ష్మీ వ్రతాన్ని చేయించారు. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు నందమూరి తాతాజీ కుమారుడు రాజేష్ చీరలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఏలూరి వెంకట సాయి సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణ అధికారి గొట్టుముక్కల నాగ సీతారామరాజు, ధర్మకర్తలు, రజక సంఘం సభ్యులు, అమ్మవారి గునుపూడి సేవా సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

కలువలతో వాసవీ మాతకు పూజలు

ఆకివీడు: స్థానిక వాసవీ మాతకు కలువ పువ్వులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక పిల్లల మర్రి అగ్రహారంలోని పార్వతీ సమేత వేంకట లింగేశ్వరస్వామి వారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు.

వీరవాసరం: వీరవాసరం గ్రూపు దేవాలయాల్లో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి వ్రతాల్లో పాల్గొన్నారు. ముందుగా గణపతి పూజ అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ఈవో కులగం వేణుగోపాలరావు, కందుల సురేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రైతుకు వెన్నుదన్నుగా ఈకేవైసీ



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: రైతుకు వెన్నుదన్నుగా ఈకేవైసీ ఉందని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మండల సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటను నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందవచ్చునన్నారు. రైతు భరోసా పథకంతో పాటు అన్ని సబ్సిడీలు, రాయితీలు, నష్టపరిహారాలు, బీమా సౌకర్యం వంటివి ఈకేవైసీతోనే సాధ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే పథకాలన్నీ ఈకేవైసీ నమోదైన రైతులందరికీ వర్తిస్తాయని చెప్పారు. ప్రతీ పంటకూ ఈకేవైసీ తప్పనిరి అని పేర్కొన్నారు. శివారు ప్రాంతాలకు సాగునీటి సరఫరా, భారీ వర్షాలకు పంట పొలాలు ముంపునకు గురికాకుండా డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖలకు సూచించారు. ప్రభుత్వం ఆయా పనులకు నిధులు విడుదల చేస్తున్నా మొక్కుబడిగా పనులు చేయించడం తగదని హెచ్చరించారు. ఏడీఏ కే.ఎస్ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో ఈకేవైసీ నమోదు 75 శాతం పూర్తయిందని, మిగిలిన రైతులు కూడా త్వరితగతిని ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. ఏఓ ఎమ్మార్ఫీ. ప్రియాంక, రైతు భరోసా కన్వీనర్లు కేశిరెడ్డి దుర్గారావు, తోట శివాజీ, ఎరిచర్ల సాంబర్లిన్ పలువురు రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించి భవన నిర్మాణం

● నోటీసులు ఇచ్చినా పట్టించుకోని వైనం



భీమవరం త్యాగరాజు భవనం సమీపంలో నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తున్న భవనం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం త్యాగరాజు భవనం సమీపాన ప్రధాన రహదారి మలుపులో నిబంధనలు అతిక్రమించి ఓ భవనం నిర్మాణం జరుగుతుంది. సెట్ బ్యాక్ (వదలవలసిన ఖాళీ స్థలం) నిబంధనల ప్రకారం వదలకుండా నిర్మాణం చేస్తున్నారు. దీనిపై భీమవరం టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ భవనం నిర్మాణం జరుగుతోంది. రోడ్డు మలుపులో ఈ భవనం నిర్మించడం సెట్ బ్యాక్ పూర్తిగా వదలకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి సదరు భవనం నిర్మాణం నిబంధనలు మేరకు జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేశాం : ఏసీపీ పి.గౌరు

త్యాగరాజు భవనం సమీపాన రోడ్డు మలుపులో నిర్మాణం చేస్తున్న భవనం నిర్మాణంలో సెట్ బ్యాక్ నిబంధనలు మేరకు వదలలేదని గుర్తించి భవనం యజమానికి నోటీసులు జారీ చేశాము. దీనిపై స్పందించకుండా నిర్మాణం చేస్తే నిబంధనల మేరకు సెట్‌బ్యాక్ ఏంత ఉండాలో అంతవరకు నిర్మాణాన్ని తొలగించడం జరుగుతుంది.

